క్లుప్తంగా

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి



కొండపాటూరు(కాకుమాను):విద్యా రంగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎస్టీయూ నూతన మండల శాఖ అధ్యక్షుడు జూపూడి ప్రకాశరావు తెలిపారు. మండలంలోని కొండపాటూరు ప్రీ హైస్కూల్‌లో ఉపాధ్యాయునిగా పని చేస్తున్న ప్రకాశరావు ఎస్టీయూ మండల శాఖ అధ్యక్షునిగా ఎన్నికైన సందర్భంగా బుధవారం పాఠశాల హెచ్‌ఎం శీలం అంకారావు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఐర్లాండ్‌లో ఉన్నత విద్య, ఉద్యోగావకాశాలు



గుంటూరు రూరల్: ఫార్మసీ విద్యకు ఐర్లాండ్ దేశంలో మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని ఐర్లాండ్ లియోగ్లోబల్ ఓవర్‌సీస్ అంతర్జాతీయ పరిపాలన సలహాదారుడు డేవిడ్ పాలన్ తెలిపారు.నగర శివారుల్లోని లాం నందున్న చలపతి ఫార్మసీ కళాశాలలో బుధవారం విద్యార్థులకు ఐర్లాండ్ దేశంలో విద్య ఉద్యోగ అవకాశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డేవిడ్ పాలన్ మాట్లాడుతూ ప్రపంచంలో అత్యధిక వేతనం తీసుకుంటున్న వారిలో రెండు శాతం విద్యార్థులు ఐర్లాండ్ నుంచి వెళ్ళిన వారేనని తెలిపారు. భారతదేశంనుంచి ఐర్లాండ్‌లో సుమారు 80 వేల మంది వివిధ రంగాల్లో స్థిరపడి ఉన్నారని చెప్పారు. ఫైజర్, ఆపిల్, ఇంటెల్, ఫార్మాస్యూటికల్ ప్రొడక్ట్స్, సాఫ్ట్‌వేర్, మెడ్‌టెక్ తదితరాలను ఎగుమతి చేసే దేశాల్లో ఐర్లాండ్ ఒకటని తెలిపారు. ఉన్నత విద్య, ఉద్యోగాలకు అవసరమైన సలహాలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రసన్నలక్ష్మి, గుంటూరు శాఖ మేనేజర్ అమూల్యను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాదెండ్ల రామారావు, చలపతి విద్యాసంస్థల అధినేత వై.వి. ఆంజనేయులు ఘనంగా సన్మానించారు.

ట్రాక్టర్ బోల్తా : డ్రైవర్ మృతి



గుంటూరు రూరల్: ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ మృతి చెందిన సంఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు, సీఐ రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం.. మేడికొండూరు మండలం పేరేచర్లకు చెందిన ఇరగదల బ్రహ్మం(35) ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తుంటాడు. ఆటోనగర్ వైపు నుంచి బుధవారం సాయంత్రం చిల్లీస్ మీదుగా పేరేచర్లకు ట్రాక్టర్‌తో బయలుదేరాడు. ప్రమాదవశాత్తూ అదుపు తప్పి ఇన్నర్ రింగ్‌రోడ్డులో బోల్తా పడింది. ప్రమాదంలో బ్రహ్మం తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

30న తిక్కిరెడ్డిపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం

ప్రత్తిపాడు: మండలంలోని తిక్కిరెడ్డిపాలెంలో ఈ నెల 30న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు గొట్టిపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మేరి యునిస్ తెలిపారు. ఇప్పటికే గ్రామంలో వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య సర్వే ప్రారంభించారన్నారు. అనారోగ్యంతో ఇబ్బంది పడే వారిని గుర్తించి ప్రాథమిక పరీక్షలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రజలంతా ఆరోగ్య సురక్ష సర్వేతో పాటు శిబిరాల్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

పౌష్టికాహారంతో చిన్నారుల ఆరోగ్యం పదిలం

గుంటూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారంతో చిన్నారుల ఆరోగ్యం పదిలంగా ఉంటుందని రూరల్ మండలం ఎంపీపీ ఇంటూరి పద్మావతి తెలిపారు. మండలంలోని అంగన్‌వాడీలు సమ్మె విరమించి, తమ డిమాండ్లను సాధించిన క్రమంలో బుధవారం నగరంలోని మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో చిన్నారులు, బాలింతలు, తల్లుల ఆరోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సకాలంలో అందించాలని సూచించారు. మండలంలోని అంగన్‌వాడీ సెంటర్‌లలో సమస్యలపై సమీక్షించారు. సెంటర్లలో కార్యకలాపాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీడీపీవో వి. సుజాతదేవి పాల్గొన్నారు.

పంటల సంరక్షణకు చర్యలు తీసుకోవాలి

పొన్నూరు: మొక్కజొన్న, మినుము, పెసర పంటల సంరక్షణకు రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలని జిల్లా వనరుల కేంద్రం పీడీ పి.రామాంజనేయులు తెలిపారు. జిల్లా వనరుల కేంద్రం, కృషి విజ్ఞాన కేంద్రం సైంటిస్టులు, వ్యవసాయ శాఖ అధికారులు కలసి బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో మొక్కజొన్న , మినుము, పెసర పంటలను పరిశీలించారు. చీడపీడలు, తెగుళ్ల నివారణకు గానూ రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం కీటక శాస్త్రవేత్త సీహెచ్. అనిల్ కుమార్, ఏడీఏ వి.రామకోటేశ్వరి, డీఆర్సీ ఏవో రాజవంశీ, ఏవో వెంకటరామయ్య పాల్గొన్నారు.

‘ఆమె’ చేతిలో నేతల తలరాత

- నియోజకవర్గ ఓటర్లు 2,64,156
- ఐదు మండలాల్లోనూ మహిళా ఓటర్లే అధికం
- నేడు జాతీయ ఓటర్ల దినోత్సవం

ప్రత్తిపాడు: సుభిక్ష భారతాన్ని భవిష్యత్ తరాలకు అందించే పాశుపతాస్త్రం.. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజ్యాంగం కల్పించిన ఓటు ఎంతో విలువైనది. ఓటే దేశ భవితకు నిర్దేశం. అవినీతి వ్యవస్థల దుమ్ముదులిపే వజ్రాయుధం. మంచి నాయకులను చట్టసభలకు పంపే అస్త్రం. ఒక్క ఓటు హక్కుతో నేతల తలరాతను తిరగరాయవచ్చు. మన వేలిపై పడే సిరా మరకతో అవినీతి మకిలీ పులుముకున్న నాయకులకు రాజకీయ సన్యాసం పట్టించవచ్చు. నేడు జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా నియోజకవర్గంలోని ఓటర్ల వివరాలు.

నారీమణుల చేతిలోనే నాయకుల భవిత

నియోజకవర్గంలో నాయకుల భవిష్యత్ అంతా



ఓటరు గుర్తింపు కార్డులు (ఫైల్)

నారీమణుల చేతుల్లో ఉంది. తాజాగా ప్రచురించిన తుది ఓటర్ల జాబితాలో ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను, వట్టిచెరుకూరు, గుంటూరు రూరల్ మండలాల్లో మహిళల అత్యధికంగా ఉన్నారు. నియోజకవర్గం మొత్తం మీద 2,64,156 ఓటర్లు ఉండగా, వారిలో 1,36,494 మంది మహిళలే. ప్రతి మండలంలోనూ మహిళా ఓటర్లే అధికంగా ఉండటంతో ఇప్పుడు వారిని ప్రసన్నం చేసుకోవడమే నాయకులకు పెద్ద టాస్క్‌గా మారనుంది. వారు ఎటు వైపు మొగ్గు చూపితే ఆ అభ్యర్థులు విజయఢంకా మోగించే అవకాశాలున్నాయి.

ఆన్‌లైన్‌లోనూ ఓటు నమోదుకు వెసులుబాటు

ఓటు హక్కును పొందేందుకు 18 సంవత్సరాలు నిండిన లేదా నిండే యువత, ఓటు హక్కులేని వారు బూత్ లెవల్ అధికారులకు, రెవెన్యూ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చు. కార్యాలయాలు, అధికారుల వద్దకు వెళ్లే పనిలేకుండా ఆన్‌లైన్ విధానం ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందుకుగాను ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. హెచ్‌టీటీపీ.//వోటర్స్.ఈసిఐ.జివోవి.ఇన్ ద్వారా నమోదు చేసుకోవచ్చు.

మండలాల వారీగా ఓటర్ల వివరాలు

మండలం	పురుషులు	మహిళలు	ఇతరులు
ప్రత్తిపాడు	19,458	20,615	–
పెదనందిపాడు	16,758	18,169	1
కాకుమాను	16,656	17,874	–
వట్టిచెరుకూరు	18,411	19,552	–
గుంటూరురూరల్	56,351	60,284	27
మొత్తం	1,27,634	1,36,494	28

నేడు ప్రత్యేక కార్యక్రమాలు

జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రత్యేక కార్యక్రమాల్ని ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నాం. నూతన ఓటర్లతో పాటు పీడబ్ల్యూడీ ఓటర్లను సత్కరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి సమక్షంలో అభినందన కార్యక్రమాలు చేయనున్నాం. అర్హత ఉండి ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోని వారుంటే వెంటనే చేసుకోవాలి.

–జి. సిద్దార్థ తహసీల్దార్, ప్రత్తిపాడు

దేవుని సన్నిధిలో మానసిక ప్రశాంతత

సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్



ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్

గుంటూరు రూరల్: దేవుని సన్నిధిలో మానసిక ప్రశాంతత లభిస్తుందని, ఆయన్ను నమ్మినవారికి విజయాలు సొంతమవుతాయని ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. 48వ డివిజన్ రెడ్డిపాలెంలోని శివనాగరాజు కాలనీలో బుధవారం బేతేలు గాస్పెల్ మినిస్ట్రీస్ నూతన మందిర ప్రతిష్టా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మందిరం ప్రతినిధులు బలసానికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మందిరంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ దేవుని నమ్మినవారికి ఎల్లపుడూ ఆయన వెన్నంటే ఉంటాడని తెలిపారు. ఆయన్ను నమ్మి నిజాయతీగా కృషిచేస్తే ఎల్లప్పుడూ విజయం వెన్నంటే ఉంటుందని తెలిపారు. అంతటి నిజాయతీ కలిగిన ముఖ్యమంత్రి నేతృత్వంలో ప్రత్తిపాడు సమన్వయకర్తగా తాను వచ్చానని, ఆ దేవుని ఆశీర్వాదాలతోపాటు ప్రజలు తనను ఆశీర్వదించాలని కోరారు. డెప్యూటీ మేయర్ బాలవజ్రబాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు గులాం రసూల్, చర్లోపల్లి గోపీకిరణ్, లక్కిరెడ్డి మనోహర్‌రెడ్డి, హేమ, మదిరం సంఘం సభ్యులు, పెద్దలు పాల్గొన్నారు.

ఉత్కం‘ఆట’భరితంగా వాలీబాల్ పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న ప్రత్తిపాడు ఎంపీపీ అన్నమ్మ, కాకుమాను జెడ్పీటీసీ గుల్జార్ బేగం,



పురుషుల విభాగంలో వాలీబాల్ విన్నర్‌గా నిలిచిన వట్టిచెరుకూరు జట్టు

- ప్రారంభమైన ‘ఆడుదాం ఆంధ్రా’ నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలు
- వాలీబాల్ విజేతగా వట్టిచెరుకూరు జట్లు
- పురుషులు, మహిళల విభాగాల్లో అదరగొట్టిన వట్టిచెరుకూరు క్రీడాకారులు

ప్రత్తిపాడు: ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ స్థాయి ఆట ల పోటీలు బుధవారం అట్టహాసంగా ప్రారంభమయ్యా యి. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని భవనం వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపీడీవో ఏ. శ్రీరమ్య ఆధ్వర్యంలో జరిగిన పోటీల్ని ప్రత్తిపాడు ఎంపీపీ దాసరి అన్నమ్మ, కాకుమాను జెడ్పీటీసీ షేక్ గుల్జార్ బేగం, వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా కన్వీనర్ ఉడుతూరి ఓంప్రకాష్ రెడ్డి, ప్రత్తిపాడు ఉప సర్పంచ్ బాపతు వెంకటేశ్వరరెడ్డి ప్రారంభించారు. అనంతరం క్రీడాకారుల్ని పరిచయం చేసుకుని పోటీల్ని ఆరంభించారు. ఎంఈవో సీహెచ్. రమాదేవి, ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ రామకోటయ్య, గ్రామస్తులు చెంచురామారావు, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

పురుషుల విభాగంలో..

ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ స్థాయి పోటీల్లో భాగంగా తొలి రోజు వాలీబాల్ పోటీలు పురుషులు, మహిళ ల విభాగాల్లో జరిగాయి. పురుషుల విభాగంలో మండ లానికి ఒక టీం చొప్పున నియోజకవర్గంలోని ప్రత్తిపాడు, పెదనందిపాడు, గుంటూరురూరల్, కాకుమా ను, వట్టిచెరుకూరు మండలాల నుండి ఐదు టీంలు పాల్గొన్నాయి. ఫైనల్స్‌కు చేరుకున్న వట్టిచెరుకూరు-ప్రత్తిపాడు జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. రెండు రౌండ్లలోనే వట్టిచెరుకూరు జట్టు 25 పాయింట్లు సాధించి విజేతగా నిలిచింది. ప్రత్తిపాడు జట్టు రన్నర్‌గా నిలిచినట్లు నిర్వాహకులు తెలిపారు.

మహిళల విభాగంలో..

మహిళల వాలీబాల్ విభాగంలో వట్టిచెరుకూరు, గుంటూరు అర్బన్ టీంలు పాల్గొన్నాయి. నువ్వా..నేనా అనే రీతిన సాగిన పోటీల్లో వట్టిచెరు కూరు బాలికలు ముందు గా పాతిక పాయింట్లును చేరుకోవడంతో ఆ జట్టును వి జేతగా ప్రకటించారు. అర్బన్ టీం రన్నర్‌గా నిలిచింది.

నేడు ఖోఖో, క్రికెట్ పోటీలు

ఆడుదాం ఆంధ్ర పోటీల్లో భాగంగా గురువారం ఖోఖో, క్రికెట్ పోటీలను నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఏ. శ్రీరమ్య తెలిపారు. ప్రత్తిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పురుషులు, మహిళల విభాగాల్లో ఖోఖో పోటీలు, గొట్టిపాడు జెడ్పీ హైస్కూలులో క్రికెట్ పోటీలు జరగనున్నాయని తెలిపారు. ఆయా మండలాల నుంచి ఎంపికైన టీంలు నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటాయని తెలిపారు.

పోటీలను యువత సద్వినియోగం చేసుకోవాలి

పొన్నూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను యువత సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ నయూమ్ అహ్మద్ అన్నారు. బుధవారం పట్టణంలోని నిడుబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన మండల స్థాయి క్రీడా పోటీలు విజయవంతంగా ముగిశాయని తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో జరిగే ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, క్రికెట్, బ్యాడ్మింటన్ క్రీడలలో యువకులు ఉత్సాహంగా పాల్గొనాలని తెలిపారు. క్రీడల పరికరాల ను ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని పేర్కొన్నారు. ఎంపీడీవో శ్రీనివాసరావు, మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది, పీఈటీలు పాల్గొన్నారు.

ఆర్థిక సమస్యలతో యువకుడి ఆత్మహత్య

చేబ్రోలు: ఆర్థిక సమస్యల కారణంగా యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన చేబ్రోలు మండలం నారాకోడూరు దళితవాడలో బుధవారం జరిగింది. నారాకోడూరు గ్రామానికి చెందిన కోడూరి కోటేశ్వరరావు (31) ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నాడు. మంగళవారం పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బంధువులు గమనించి గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోటేశ్వరరావు బుధవారం మరణించాడు. మృతునికి భార్య, కుమార్తె ఉన్నారు.

సంక్షేమం.. అభివృద్ధి వైఎస్సార్ సీపీకే సాధ్యం

ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య

పెదకాకాని: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ద్వారా సాధ్యమైందని ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య తెలిపారు. మండలంలోని నంబూరులో నూతనంగా రూ. 4,16,10,000తో నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రం, అంతర్గత సీసీ రోడ్లు, సీసీ డ్రైన్‌లు, రైతులకు ఉపయోగకరంగా ఏర్పాటు చేసిన ఐదు కిలోమీటర్ల బావిరెడ్డి కుంట రోడ్డుకు బుధవారం రాత్రి ప్రారంభోత్సవం చేశారు. పలు రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. గోళ్లమూడిలో రూ. 15 లక్షలతో నిర్మించిన ఆర్వో ప్లాంటును ప్రారంభించారు. ఈ సందర్భంగా నంబూరులో ఏర్పాటు చేసిన సభకు స్థానిక నాయకుడు ప్రకాష్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య మాట్లాడుతూ గత నాలుగున్నర సంవత్సరాలలో నంబూరులో రూ. 6.70 కోట్లతో 177 అభివృద్ధి పనులు చేసినట్లు చెప్పారు. పొన్నూరు నియోజకవర్గంలో సంక్షేమ పథకాల ద్వారా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో రూ.1600 కోట్లు జమ చేసినట్లు తెలిపారు. అభివృద్ధి పనులు చూసి ప్రజలు అండగా నిలవాలని, ఓటుతో పార్టీ విజయం కోసం కృషి చేయాలని కోరారు.

అసత్య ప్రచారాలు, మోసం చేయడంలో టీడీపీ నాయకులు దిట్ట

అసత్య ప్రచారాలు చేయడం, ప్రజల్ని మోసం చేయడంలో టీడీపీ నాయకులు ఆరితేరారని పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య ఆరోపించారు. అమలు కాని హామీలతో గద్దెనెక్కిన టీడీపీ నాయకులు ఎన్నికల మేనిఫెస్టోను కనబడకుండా దాచిపెట్టారని ఎద్దేవా చేశారు. రుణమాఫీ పేరుతో రైతులను, డ్వాక్రా మహిళలను మోసం చేసిన సంఘటన ప్రజలు మర్చిపోలేదన్నారు. నిరు



నంబూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య

ద్యోగ భృతి పేరుతో నిరుద్యోగులను కూడా మోసం చేశారన్నారు. విద్యను కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేశారన్నారు. పొన్నూరు పట్టణంలో ప్రజలు రోడ్డు విస్తరణ కోసం 30 ఏళ్లుగా ఎదురు చూస్తున్నారని, 160 ఏళ్ల క్రితం చేబ్రోలు శివారులో నిర్మించిన బ్రిడ్జి శిథిలావస్థకు చేరితే నిర్మాణం పనులు చేపట్టామన్నారు. ఉప్పలపాడు, వెంకటకృష్ణాపురం గ్రామాలకు తాగునీరు పంపిణీ చేసిన ఘనత వైఎస్సార్ సీపీకే దక్కుతుందన్నారు. ప్రతి పక్షాల అసత్య ప్రచారాలను తిప్పి కొట్టాలని పనిచేసే ప్రభుత్వానికి ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు. ఆయా గ్రామాల్లో జరిగిన సమావేశాల్లో ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ల జ్యోతి, ఎంపీడీవో బి.వి. మల్లేశ్వరరావు, సర్పంచి నడింపల్లి కోటేశ్వరమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు దంతాల శివపార్వతి, ఎంఎస్ఎంఈ డైరెక్టర్ భీమవరపు విజయలక్ష్మి, పార్టీ మండల అధ్యక్షుడు చాగంటి మురళీమోహన్‌రెడ్డి, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ జొన్నల అవినాష్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్‌పర్సన్ భీమవరపు కోటిరెడ్డి, శివాలయం చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు, స్థానిక నాయకులు జొన్నల కరుణాకరరెడ్డి, కూసం తిరుమలరెడ్డి, డాక్టర్ కె. రాజ్యలక్ష్మి, సయ్యద్ సుభాని, బొంతు శివారెడ్డి, వెంకటరావు, చెన్నం రామకోటేశ్వరరావు, పీఆర్ ఏఈ జగదీష్, పంచాయతీ కార్యదర్శి షేక్ సుభాని, వార్డు సభ్యులు, పలువురు అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్‌బీకే సేవలను సద్వినియోగం చేసుకోవాలి

కాకుమాను: రైతు భరోసా కేంద్రాల్లో అందిస్తున్న సదుపాయాలు, పథకాల్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ నల్లమోతు శివరామకృష్ణ తెలిపారు. స్థానిక రైతు భరోసా కేంద్రం-2లో బుధవారం వ్యవసాయ సలహా మండల సమా వేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శివరామకృష్ణ మాట్లాడుతూ గ్రామస్థాయిలోనే రైతులకు ఎరువులు, విత్తనాలు, పురుగు మందులను సకాలంలో అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రతి గ్రామంలో ఎన్నో కోట్లు ఖర్చు చేసి రైతు భరోసా కేంద్రాల్ని నిర్మించారని తెలిపారు. పొన్నూరు ఏడీఏ రామకోటేశ్వరి మాట్లాడుతూ రబీ సీజన్‌లో సాగు చేస్తున్న పంట వివరాలను రైతులు నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రధానమంత్రి కిసాన్ సన్మాన్ నిధికి అర్హులైన రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని ఆమె తెలిపారు.వ్యవసాయ సలహా మండలి మండల అధ్యక్షుడు కొత్త అమేష్, ఏవో కె.కిరణ్మయి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నేడు ఉపాధి హామీ మహిళా మేట్లుకు శిక్షణ

ప్రత్తిపాడు: ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న మహిళా మేట్లుకు గురువారం గొట్టిపాడు పంచాయతీ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఏపీవో షేక్ మస్తాన్‌వలి తెలిపారు. గొట్టిపాడు, గనికపూడి పంచాయతీల్లో పనిచేస్తున్న మేట్లు తప్పనిసరిగా సమావేశానికి హాజరుకావాలని ఆయన కోరారు. ఉపాధి హామీ పథకంలో మార్పులు, పనుల గుర్తింపు, కొలతలు తీసే విధానంతో పాటు మస్టర్లు వేసే సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలపై వారికి శిక్షణ ఇవ్వనున్నట్లు మస్తాన్‌వలి చెప్పారు.

పేదల ఆరోగ్యానికి జగనన్న భరోసా



శిబిరంలో పాల్గొన్న డాక్టర్లు, వైద్య సిబ్బంది



ఆరోగ్య సురక్ష కార్డులు అందిస్తున్న బ్రహ్మారెడ్డి

పొన్నూరు: పేదల ఆరోగ్యానికి భరోసా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి పొన్నూరులో విశేష స్పందన లభిస్తోంది. పట్టణంలోని 23వ వార్డు వైయస్సార్ ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. వివిధ ఆరోగ్య సమస్యలపై వచ్చిన ప్రజలకు వైద్య సిబ్బంది పరీక్షలు, చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో వార్డు మాజీ కౌన్సిలర్ గేరాకుమారి మాట్లాడుతూ పేదల ఆరోగ్యానికి భరోసా కల్పించేందుకు ఇంటి వద్దకే మెరుగైన వైద్య సేవలు అందించిన ఘనత సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని తెలిపారు. గత ప్రభుత్వాలలో ఎన్నడూ లేని విధంగా సంక్షేమ పాలన అందిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గేరా సంజీవ్, మిక్కిలి మోహనరావు, పుట్లా ఫ్రాంక్లిన్, చలపతిరావు, డాక్టర్ వై. అలేఖ్య, డీఎస్. ఫిరోజ్, ఏఎస్ఎంలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

గుంటూరు రూరల్‌లో..

26వ డివిజన్ పరిధిలోని సీఆర్ కాలనీలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని నిర్వహించారు. వైద్య పరీక్షలు చేయించుకునేందుకు పెద్దసంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. వైద్యులు పరీక్షలు చేసి ఉచితంగా మందులు, కళ్లజోళ్లు అందజేశారు. కార్యక్రమంలో అంకిరెడ్డిపాలెం మాజీ సర్పంచ్ బ్రహ్మారెడ్డి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలకు కార్పొరేట్ వైద్యం అందించి వారి ఆరోగ్యాలను కాపాడేందుకు జగనన్న కృషి చేస్తున్నారని తెలిపారు. ఆరోగ్య శ్రీ ద్వారా రూ. 25 లక్షల విలువ చేసే వైద్య సేవల్ని ఉచితంగా అందిస్తున్న ఏకైక ప్రజా నాయకుడు మన జగనన్న అని పేర్కొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో శ్రీరమ్య, ఎంపీపీ దాసరి అన్నమ్మ తదితరులు



రేటూరు ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న సీహెచ్‌వో సదాశివరావు

ప్రత్తిపాడు: బాలల హక్కుల పరిరక్షణ బాధ్యత మనందరిపైనా ఉందని ఎంపీడీవో ఏ. శ్రీరమ్య అన్నారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా బుధవారం ఎంఈవో రమాదేవి ఆధ్వర్యంలో ప్రత్తిపాడు హైస్కూలులో పోస్టర్లను ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా ఎంపీపీ దాసరి అన్నమ్మ, ఎంపీడీవో ఏ. శ్రీరమ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ బాలికల పరిరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో చట్టాలు, పథకాల్ని అమలు చేస్తున్నాయని తెలిపారు. ప్రస్తుత సమాజంలో బాలికలు అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారని పేర్కొన్నారు. బాలికల చదువు మధ్యలోనే ఆగిపోకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో కాకుమాను జెడ్పీటీసీ సభ్యురాలు గుల్జార్ బేగం, కొండేపాడు సర్పంచ్ నర్రా రాంబాబు, ప్రత్తిపాడు ఉప సర్పంచ్ బి. వెంకటేశ్వరరెడ్డి, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బాలికా విద్యతోనే దేశాభివృద్ధి

రేటూరు(కాకుమాను):బాలికా విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యమని కాకుమాను పీహెచ్‌సీ సీహెచ్‌వో సదాశివరావు తెలిపారు. మండలంలోని రేటూరు జెడ్పీ హైస్కూలులో బుధవారం జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సదాశివరావు మాట్లాడుతూ ఇంటికి వెలుగునిచ్చే ఆడపిల్ల ప్ర తి ఇంటిలో ఉండాలని తెలిపారు. ప్రతి ఒక్కరు ఆడపిల్లల విద్యను ప్రోత్సహించి వారిని అన్ని రంగా ల్లో రాణించే విధంగా కృషి చేయాలని ఆయన తెలి పారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

- మండలంలోని పొంద్రపాడు ఎంపీపీ పాఠశాలలో బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఈవో -2 విజయ్ భాస్కర్ మాట్లాడుతూ సృష్టికి మూలం స్త్రీ అని, వారిని గౌరవించాల్సిన బాధ్యత అందరిపైన ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.


ఆర్‌వీఆర్‌జేసీలో వేడుకలు

గుంటూరు రూరల్: బాలికల కలల సాకార సాధనకు సహకరిస్తే వారు అద్భుతాలు సృష్టిస్తారని ఆర్‌వీఆర్ జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్. శ్రీనివాస్ తెలిపారు. జాతీయ బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం చౌడవరంలోని కళాశాలలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యక్షుడు మాట్లాడుతూ విద్యార్థినుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించే దిశగా, సమాజంలో వారి హక్కుల సాధనకు, అంతర్జాతీయ స్థాయిలో మహిళలు సాధించిన విజయాలను వివరించారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఆర్. గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె. కృష్ణప్రసాద్ మాట్లాడుతూ బాలికలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు తమ కళాశాల ఎల్లపుడూ ముందు వరుసలో ఉంటుందని తెలిపారు. అనంతరం విద్యార్థినులకు డిజిటల్ జనరేషన్, మన తరం, మన కాలం, ఇప్పుడు మన హక్కులు, మన భవిష్యత్తు అనే అంశాలపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రోత్సాహక నగదు బహుమతులు, సర్టిఫికెట్లను అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ కె. శ్రీనివాస్, డైరెక్టర్ కె. రవీంద్ర, ఏవో డైరెక్టర్ ఎస్.వి.శ్రీనివాస్, ఉమెన్ వెల్ఫేర్ కమిటీ కన్వీనర్ డాక్టర్ రాధారాణి, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

బాలికల రక్షణ, హక్కులపై అవగాహన అవసరం

శేకూరు(చేబ్రోలు): బాలికల రక్షణ, హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని శేకూరు గ్రామ సర్పంచ్ మాతంగి శ్యామల తెలిపారు. శేకూరులో బుధవారం జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా ర్యాలీతో పాటు బాలికలను రక్షించుకుందాం - వారి హక్కులు కాపాడుదాం పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం గ్రామస్తులకు నిర్వహించిన సమావేశంలో సర్పంచ్ మాతంగి శ్యామల, క్రాఫ్ కో- ఆర్డినేటర్ జి. వెంకయ్య మాట్లాడుతూ బాలికలందరూ బడిలో ఉండేలా చూడాలని తల్లిదండ్రుల్ని కోరారు. బాలికలపై వివక్ష, వేధింపులు, బాల్య వివాహాల్ని అరికట్టవలసిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. సమావేశంలో క్రాఫ్ సిబ్బంది శైలు, గ్రామ వలంటీర్స్, డ్వాక్రా మెంబర్స్, బాలికలు పాల్గొన్నారు.

గొట్టిపాడు రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు



పొక్లెయినర్‌తో చదును చేయిస్తున్న ప్రత్తిపాడు-గొట్టిపాడు రోడ్డు

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు- గొట్టిపాడు రోడ్డుకు తాత్కాలిక మరమ్మతు పనుల్ని బుధవారం నిర్వహించారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడు నుంచి గొట్టిపాడు వెళ్లే రోడ్డు పూర్తిగా ఛిద్రమయ్యింది. దీంతో నూతన రోడ్డు నిర్మాణానికి కొద్ది నెలల కిందట ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. శంకుస్థాపన పూర్తయ్యాక కాంట్రాక్టర్ పనుల్ని మొదలు పెట్టాడు. ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయం నుంచి వడ్డెర కాలనీ వరకు సైడ్ సీసీ డ్రెయిన్లు నిర్మించడంతో పాటు, గొట్టిపాడు ప్రారంభంలో లోలెవల్ చప్టాపై వంతెనను కూడా నిర్మించారు. అనంతరం కాంట్రాక్టర్ పనుల్ని మధ్యలోనే నిలిపివేశాడు. దీంతో రోడ్డు గోతులమయమై, ప్రత్తిపాడులోని వడ్డెర కాలనీవాసులతో పాటు రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇదే విషయాన్ని మంగళవారం గ్రామస్తులు ప్రత్తిపాడు వచ్చిన బలసాని కిరణ్‌కుమార్‌కు వివరించారు. సానుకూలంగా స్పందించిన ఆయన ఇరవై నాలుగు గంటలు కూడా గడవకముందే బుధవారం రోడ్డుపై గోతుల్ని పొక్లెయినర్‌తో చదును చేయించి తాత్కాలిక మరమ్మతులు చేయించారు.

వీవీఐటీలో భవిష్యత్ భవన నిర్మాణంపై సదస్సు



సుధీర్‌నాథ్ బుడ్డీని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

పెదకాకాని: వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీవీఐటీ)కళాశాలలోని సివిల్ ఇంజనీరింగ్‌కు చెందిన నిర్మాణద్రష్ట విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో భవిష్యత్ భవన నిర్మాణం, రూపకల్పన బిల్డింగ్ ఇన్ఫర్మేషన్ మోడలింగ్ అంశంపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య వక్తగా ఆస్ట్రేలియాకు చెందిన ఏసీఈబీఐఎం సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ డైరెక్టర్ డాక్టర్ సుధీర్‌నాథ్ బుడ్డీ హాజరయ్యారు. భవన నిర్మాణ సమయంలో వ్యర్థాలను తగ్గించి నాణ్యత, సామర్థ్యాల పెరుగుదలకు బిల్డింగ్ ఇన్ఫర్మేషన్ మోడలింగ్ (బీమ్) సాంకేతికత దోహదపడుతుందని వివరించారు.దీని ద్వారా నిర్మాణ సమయంలో కార్బన్ ఉద్గారాలను గణనీయంగా తగ్గించవచ్చని, డిజైన్ దశలో విద్యుత్, నీటి వినియోగం తగ్గుతుందని తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వై. మల్లికార్జునరెడ్డి, డీన్ ఆఫ్ అడ్మిన్ డాక్టర్ ఎస్. కుమారస్వామి, డీన్ ఆఫ్ అకడమిక్ డాక్టర్ కె. గిరిబాబు, సివిల్ విభాగాధిపతి డాక్టర్ టి. శ్రీధర్‌బాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.